సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం। 17 । డిసెంబర్ । 2022



అడవి బిడ్డలకు మరింత పోషణ

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తోంది. 10లో



ప్రాణదాతలుగా నిలవాలి

ఉన్నత చదువులు చదివే విద్యార్థులు రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. 10లో

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



సాక్షి, పాడేరు: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మినుములూరులో 13 డిగ్రీలు, అరకులోయలో 15.1 డిగ్రీలు, చింతపల్లిలో 15.5 డిగ్రీలు నమోదయ్యాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. మంచు దట్టంగా కురుస్తోంది.

సాగులో చదువులో భళా

జిల్లాలోని చింతపల్లి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. ఇక్కడి విద్యార్థులు తమకెవరూ సాటిలేరంటూ సత్తా చాటుతున్నారు. సేంద్రియ కళాశాలగా మార్పుచేసిన ఆరేళ్లలో ఐదు సార్లు రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులు, అగ్రికల్చర్ బీఎస్సీలో సీట్లు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



చింతపల్లి వ్యవసాయ పాల్‌టెక్నికల్ కళాశాల



పంటలకు సోకిన తెగుళ్లను గుర్తిస్తున్న విద్యార్థులు (ఫైల్)

- వ్యవసాయ విద్యలో ప్రతిభ
- సత్తా చాటుతున్న చింతపల్లి వ్యవసాయ సేంద్రియ పాలిటెక్నిక్ విద్యార్థులు
- రాష్ట్రస్థాయిలో ఐదేళ్లుగా స్టేట్ ఫస్ట్ ర్యాంక్
- ఉత్తమ బోధనతో సత్ఫలితాలు

చింతపల్లి: రాష్ట్రంలో 17 ప్రభుత్వ, 39 ప్రైవేటు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిలో రెండు సేంద్రియ కళాశాలలుండగా ఒకటి చింతపల్లి, మరొకటి అనంతపురం జిల్లాలో ఉంది. 2011లో ఇక్కడ ఏర్పాటు చేసిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను 2017 నుంచి సేంద్రియ కళాశాలగా మార్చు చేశారు. ఏటా ఈ కళాశాలలో 40 మంది విద్యార్థులు వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్నారు. కళాశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 19 మంది విద్యార్థులు అగ్రిసెట్ పాసై అగ్రికల్చర్ బీఎస్సీకి అర్హత పొందారు. తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ నాణ్యమైన విద్య బోధన ఇక్కడ అందించడం వల్ల అగ్రిసెట్‌లో సత్తా చాటగలుగుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు.

- అనకాపల్లికి చెందిన భరత్ అగ్రిసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. మరో ఇద్దరు విద్యార్థులు రెండు, మూడు ర్యాంకులు పొందారు. ఐదు, ఎనిమిది, 21వ ర్యాంకులు సొంతం చేసుకున్న విద్యార్థులు ఏజీబీఎస్సీలో సీట్లు సాధించారు.
- ఏటా టెన్త్ పరీక్షల ఫలితాలు వెలువడిన తరువాత మొదటి విడత పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.
- రెండేళ్ల పాటు వ్యవసాయ విద్యా బోధనతో పాటు, ప్రత్యక్షంగా పొలంలో రైతులు పడే కష్టాలు తెలుసుకునేలా తెగుళ్లు, నివారణ పద్ధతులపై ఇక్క అవగాహన కల్పిస్తున్నారు.
- సేంద్రియ వ్యవసాయం.. రసాయన ఎరువుల వినియోగించకుండా మంచి దిగుబడులు సాధన, గాలి, నీరు కలుషితం కాకుండా కాపాడుకోవడం తదితర అంశాలపై విద్యార్థి దశలోనే నేర్పిస్తున్నారు.
- వ్యవసాయ విద్య పూర్తి చేసిన ఇక్కడి విద్యార్థులు ఏటా జరిగే అగ్రిసెట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తున్నారు. ఏజీబీఎస్‌లో ప్రవేశానికి అర్హత పొందుతున్నారు. 2017 నుంచి ఇప్పటివరకు ఐదు సార్లు ఇక్కడ విద్యార్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు.
- పాల్‌టెక్నికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ పరిశోధన స్థానం ఏడీఆర్ కావడంతో విద్యాబోధన పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యా బోధనతో పాటు పంటలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ పద్ధతులపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించగలుగుతున్నారు.

శాస్త్రవేత్త కావడమే లక్ష్యం



వ్యవసాయ విద్య కష్టంతో కూడుకున్నా శాస్త్రవేత్త కావాలన్న లక్ష్యంతో చదివాను. గిరిజన ప్రాంతంలో ఇంతటి నాణ్యమైన విద్యబోధన దొరుకుతుందని ఊహించలేదు. స్టేట్ మొదటి ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. శాస్త్రవేత్తలకు రుణపడి ఉంటాను.

– **భరత్ బాబు**, అగ్రిసెట్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్

ఉపాధి అవకాశాలు ఎక్కువ



వ్యవసాయ విద్యలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా వస్తాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి, ఉద్యోగాలను సులభంగా సంపాదించవచ్చు. టెన్త్ చదువుకున్న వారు కళాశాలలో ప్రవేశాలకు అర్హులు. కౌన్సెలింగ్‌లో సీట్లు సాధించాలి. గిరిజనులకు మరిన్ని అవకాశాలు వస్తాయి. సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుంది.

– **డాక్టర్ ఎం. సురేష్‌కుమార్**, ప్రిన్సిపాల్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, చింతపల్లి

వైఎస్సార్ కంటి వెలుగు సద్వినియోగం

చింతూరు సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



మహిళకు కంటద్దం అందిస్తున్న సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

చింతూరు: అంధత్వ రహిత సమాజం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ కంటివెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. గతంలో ఈ పథకంలో కంటి పరీక్షలు నిర్వహించిన నాలుగు మండలాలకు చెందిన వారికి శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా 60 ఏళ్లు పైబడిన వారికి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైతే శస్త్రచికిత్సలు చేస్తారని ఆయన తెలిపారు. గతంలో కంటి పరీక్షలు నిర్వహించిన చింతూరు మండలంలో 103, కూనవరంలో 78, వీఆర్‌పురంలో 39, ఎటపాకలో 83 మందికి ఆయన కళ్లజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, వైద్యాధికారి ఉదయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాల్‌బ్యాడ్మింటన్‌లో అగ్నిమాపకశాఖ అధికారి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్

పాడేరు రూరల్ : అగ్నిమాపక శాఖ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపాల్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పేరూరి శ్రీనివాస్ ప్రతిభ కనబరిచారు. బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి భూపాల్‌రెడ్డితో కలిసి డబుల్స్ విభాగంలో ప్రథమస్థానం సాధించారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఎన్. సంజాయ్ చేతులమీదుగా బహుమతి అందుకున్నారు.

బొర్రా పంచాయతీకి రూ.లక్ష అందజేత



ఎంపీడీవో శ్రీహర్షిత్ సమక్షంలో రూ.లక్ష చెక్కును అందజేస్తున్న బ్రో సభ్యులు

అనంతగిరి: మండలంలోని బొర్రా రూరల్(బ్రో) ఆధ్వర్యంలో పీసా చట్టం ద్వారా పర్యాటకులను బొర్రా నుంచి కటికి జలపాతానికి వాహనాల్లో తరలించి, వచ్చిన ఆదాయంలోని 20 శాతం నిధులను పంచాయతీకి అందజేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీహర్షిత్ సమక్షంలో బ్రో ఆదాయంలోని 2022–23 సంవత్సరానికి సంబంధించి రూ.లక్షను చెక్కు రూపంలో సర్పంచ్ అప్పారావు, కార్యదర్శికి బ్రో సభ్యులు అందజేశారు.

ఆరు వేల లీటర్ల పులుపు ధ్వంసం



పులుపును ధ్వంసం చేస్తున్న పోలీసులు

కొయ్యూరు: ఆపరేషన్ పరివర్తనలో భాగంగా సారా తయారీదారులపై పోలీసులు దాడులు నిర్వహించారు. మర్రిపాలెం,చిట్టింపాడుశివారు ప్రాంతాల్లో ఆరువేల లీటర్ల సారా పులుపును ధ్వంసం చేశారు. సీఐ స్వామినాయుడు,ఎస్ఐ రాజారావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేపట్టారు. అనంతరం గ్రామాల్లో సారా తయారీపై కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వినియోగదారుల సంఘం ప్రతినిధులు

అరకులోయ రూరల్: వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని వినియోగదారుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సమర్థి రఘునాథ్,వి నియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా చైర్మన్ మర్రి సత్యనారయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చైతన్య వంతులుగా మారితేనే మోసాల నిర్మూలనకు సాధ్యపడుతుందన్నారు. హెచ్ఎం శెట్టి సుందర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కోటి పాల్గొన్నారు.

లంబసింగిలో పట్టాలెక్కిన పర్యాటక అభివృద్ధి



పర్యాటక కేంద్రమైన లంబసింగి



ప్రారంభానికి సిద్ధమైన పర్యాటకశాఖ భవనాలు

- ప్రారంభించేందుకు అధికారుల ఏర్పాట్లు
- హాజరు కానున్న ఆ శాఖ మంత్రి రోజా

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిలో ఏపీ టూరిజం భవనాలు ప్రారంభానికి సిద్ధ మయ్యాయి. ఆదివారం పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్, పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర వీటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పర్యాటక అభివృద్ధి పట్టాలెక్కడంతో ఈ ప్రాంత గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సముద్ర మట్టానికి దాదాపు 3,600 అడుగుల ఎత్తులో ఉన్న లంబసింగిలో శీతాకాలంలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఉదయం 10 గంటల వరకు దట్టంగా కమ్ముకునే పొగ మంచు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. దీంతో ఏటా అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు వివిధ రాష్ట్రాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. వీరికి కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో ఏపీ టూరిజం అభివృద్ధికి రూ.4 కోట్లు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. 2017లో పనులు ప్రారంభించారు. ఏసీ సూట్లు 4, ప్రీమియం సూట్లు 4, టెంట్ల కాటేజీలు 4, రెస్టారెంట్లు నిర్మించ తల పెట్టారు. గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిర్మాణాలు నత్తనడకన సాగాయి. కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అప్పటి పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకుగాను సీఎం కూడా స్పందించి నిధులు మంజూరు చేయడంతో పనులు శరవేగంగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఏసీ సూట్స్, రెస్టారెంట్ నిర్మాణాలు పూర్తికావడంతో పర్యాటకుల కష్టాలు తీరనున్నాయి. ఆదివారం మంత్రి రోజా వీటిని ప్రారంభిస్తారని అధికారవర్గాలు తెలిపాయి. వీరితో పాటు కలెక్టర్ సుమిత్ కుమార్, టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ, టూరిజం ఎండీ కన్నబాబు, చీఫ్ ఇంజినీర్ సి.ఎస్.ఎస్.ఎన్ మూర్తి, పీవో గోపాలకృష్ణ హాజరు కానున్నారు. రిసార్ట్స్, ఏసీ సూట్లు ఆన్‌లైన్‌లో పొందవచ్చని లంబసింగి టూరిజం కోఆర్డినేటర్ అప్పలనాయుడు పేర్కొన్నారు.

వినతులు సత్వర పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 56 అర్జీల స్వీకరణ



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: స్పందన కార్యక్రమంలో గిరిజనుల నుంచి స్వీకరించిన వినతులన్నింటిని పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి వినతులు 56 స్వీకరించారు. వెంటనే పరిష్కరించాలని వాటిని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. డీఆర్వో బి.దయానిధి, ఐటీడీఏ ఏపీవో వి.ఎస్.ప్రభాకరరావు, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఇంజనీరింగ్ శాఖల ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు,లావణ్యకుమార్, బాలసుందరబాబు, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీఎల్పీవో పీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పెదబయలు మండలం పెదకోడాపల్లి గ్రామానికి చెందిన రత్నకుమారి పాడేరు జిల్లా ఆస్పత్రిలో సుఖప్రసవం జరుపుకున్నారని, ఆమె ఆరోగ్యశ్రీ కార్డు వివరాలను సంబంధిత వైబ్‌సైట్‌లో నమోదు చేయాలని భర్త సింహాచలం కోరారు.
- బొంగరం పంచాయతీ పోతలగరువులో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టులో తనను నియమించాలని అదే ప్రాంతానికి చెందిన ముప్వల దీనాకుమారి విన్నవించారు.
- పాడేరు మండలం కొత్త పాడేరు గ్రామానికి చెందిన కురుసా అనూషలక్ష్మి ఫార్మసిస్టు ఉద్యోగం, చింతపల్లి మండలం కట్టుబంద గ్రామానికి చెందిన కె.కృష్ణవేణి ఏఎన్ఎం ఉద్యోగ నిమిత్తం వినతిపత్రం అందజేశారు.
- పాడేరు ఐటీడీఏ సహకారంతో 1986–1987లో జీడితోటలు సాగు చేపట్టామని, వీటికి సంబంధించి భూహక్కు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయాలని ముంచంగిపుట్టు మండలం మాకవరం గ్రామానికి చెందిన పాంగి రమేష్ కలెక్టర్‌ను కోరారు.
- చింతపల్లి మండలం అంజలి శనివారం, కోటలగరువు గ్రామాలకు చెందిన పాంగి నాగమ్మ,కొర్రా ప్రసాద్,కొర్రా వసంత తదితరులు సాగు చేస్తున్న పోడుభూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేయాలని వినతిపత్రం అందజేశారు.
- పాడేరు మండలం కించూరు పంచాయతీ తోటలగొందిలో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేపట్టి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ వంతాల రాంబాబు, గ్రామపెద్ద జి.ఈశ్వరరావు కలెక్టర్‌ను కోరారు.

ప్రైవేట్ కంటి ఆస్పత్రి తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి,పాడేరు: స్థానిక పాత ఆస్పత్రి సమీపంలోని ప్రైవేట్ కంటి ఆస్పత్రిని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఐవో డాక్టర్ ప్రభావతిశుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. నేత్ర పరీక్షల విభాగంలో డిప్లమో పొందిన శ్రీనివాసరావు ఈ ఆస్పత్రిని నడుపుతుండటంపై అన్ని రికార్డులు, ఆయన అర్హత ధ్రువపత్రాలను పరిశీలించారు.కంటి పరీక్షల యంత్రాలను వారు తనిఖీచేశారు.

ఆర్టీసీ డిపో ఏర్పాటుకు స్థల పరిశీలన

సీలేరు: ఆర్టీసీ డిపో నిర్మాణానికి గాను శుక్రవారం సీలేరులో అధికారులు స్థలపరిశీలన చేశారు. ధారాలమ్మ ఘాట్ రోడ్డు నుంచి సీలేరు మీదుగా తెలంగాణ, ఒడిశాలోని ఇతర జిల్లాలకు వెళ్లేందుకు వీలుగా ఇక్కడ డిపో నిర్మాణానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు గాను ఐదు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిధిలో స్థలాన్ని తరువాత పాత ఐటీఐ ప్రదేశాన్ని గుర్తించారు. డిపో నిర్మాణానికి 30 బస్సులు నిలిపే స్థలంతోపాటు మరమ్మతులకు గ్యారేజీ, హోటల్, దుకాణాలు, కార్యాలయం, విశ్రాంతి గదులు నిర్మించాల్సి ఉంటుందని వారు తెలిపారు. స్థల పరిశీలనపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పూర్తి స్థాయిలో నివేదిక అందజేస్తామని వారు పేర్కొన్నారు.ఆర్టీసీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ అప్పలనాయుడు, జిల్లా రవాణాధికారి ఆర్.ఎస్.నాయుడు, రీజనల్ డ్రైవింగ్ ఇనస్పెక్టర్ ఆర్‌వీఆర్ రాజు, డీవీ నర్సింగరావు, జెన్‌కో అధికారులు ఏడీ అప్పలనాయుడు, ఏఈఈ సురేష్, ఎంపీటీసీ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సీలేరులో ఆర్టీసీ డిపో నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

పవర్ కెనాల్ పటిష్టతకు చర్యలు



డొంకరాయి పవర్ కెనాల్‌కు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ



ఫోర్‌బే రిజర్వాయర్‌ను పరిశీలించిన డైరెక్టర్ సత్యనారాయణ

- ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సత్యనారాయణ
- పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో కొత్త యూనిట్ల నిర్మాణం
- పనులు చేపట్టాలని సూచన

మోతుగూడెం: ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎంపీ సత్యనారాయణ రెండో రోజు డొంకరాయి పవర్ కెనాల్ గండి పడిన ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. పవర్ కెనాల్‌కు పడిన గండిని యుద్ధప్రాతిపదికన ప్రాతిపదికన పూడ్చే పనులు ప్రారంభించాలని జెన్‌కో అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ఫోర్‌బే రిజర్వాయర్‌తోపాటు పవర్ కెనాల్‌ను పరిశీలించారు. ఎక్కడెక్కడ పనులు అవసరమో గుర్తించి వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. పవర్ కెనాల్‌కు మళ్లీ ఇటువంటి నష్టం రాకుండా చర్యలు తీసుకోవాలని అక్కడున్న అధికారులను ఆదేశించారు. అనంతరం పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో కొత్తగా యూనిట్‌లు నిర్మించే ప్రదేశాలను పరిశీలించారు. యూనిట్ నిర్మాణ పనులు పనులు పొందిన కాంట్రాక్టర్లు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ యూనిట్ పనితీరుపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో నిర్మించబోయే ఐదు,ఆరు యూనిట్ల పనులు వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. పవర్ కెనాల్ పరిశీలించి అక్కడ చేయాల్సిన పనులపై అధికారులతో సమావేశం నిర్వహించి, తిరిగి ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా పటిష్ట చర్యలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. పవర్ కెనాల్‌కు గండిపడడం వల్ల ఎంత నష్టం వచ్చిందో ఏపీ జెన్‌కో ఎండీకి నివేదిస్తామని చెప్పారు. పనులు సత్వరమే జరిగేలా చూస్తామని కెనాల్ పటిష్టతకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.హైడల్ సీఈ శేషారెడ్డి, ఎస్ఈ సివిల్ ప్రశాంత్‌కుమార్, సీఈ నాగేశ్వరరావు,ఈఈలు బాబూరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి నిరసనగా ఆందోళన



ప్రిన్సిపాల్ శర్మతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు



జి.మాడుగులలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ, గిరిజన సంఘం నాయకులు



విద్యార్థి మృతికి కారణాలను తెలుసుకుంటున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాస్తారోకో

జి.మాడుగుల: గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాధ్యతారాహిత్యం వల్లే గిరిజన విద్యార్థి మృతి చెందాడని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాగేని ధర్మన్నపడాల్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి జీవన్‌కృష్ణ ఆరోపించారు. శుక్రవారం జి.మాడుగులలో ఆయా సంఘాల అధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కొండబాబు కుటుంబ సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అంతేకాకుండా గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం సమగ్రవిచారణ జరిపించాలని వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు దీనబంధు, కొర్రా కార్తీక్, మల్లేష్, భగీరథ, భాస్కర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు

జి.మాడుగుల: గిరిజనుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూడటమే లక్ష్యమని ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థి కొండబాబు మృతిపై శుక్రవారం ఆయన గురుకులంలో విచారణ చేట్టారు. మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. విద్యార్థి మృతి విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా కనిపిస్తుందన్నారు.

విద్యార్థి మరణానికి కారకులైన వారిపై ఎస్టీ కమిషన్ చర్యలు చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర పాల్గొన్నారు.

విద్యార్థి మృతి దురదృష్టకరం

జి.మాడుగుల: స్థానిక గురుకులం పాఠశాల విద్యార్థి కొండబాబు మృతి దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె గురుకులం పాఠశాలను సందర్శించారు. విద్యార్థి మృతికి కారణాలను ప్రిన్సిపాల్ శర్మ, ఉపాధ్యాయుల నుంచి ఆమె తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్య స్నేహభావం, సఖ్యత ఉండేలా ఉపాధ్యాయులు నేర్పించాలని ఆమె సూచించారు. విద్యార్థి మృతికి బాధ్యులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆమె పేర్కొన్నారు. సొలభం సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు, కిముడు రాంబాబు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర పాల్గొన్నారు.

లారీ ఢీకొట్టి బాలిక దుర్మరణం


లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన మాధవి

పాయకరావుపేట : జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న లారీ ఢీకొట్టిన ఘటనలో బాలిక మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎస్.రమేష్ తెలిపారు. స్థానిక పోసినవారి వీధికి చెందిన పోసిన మాధవి (15) గురువారం అర్ధరాత్రి స్నేహితుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి తన స్నేహితులతో కలిసి బైక్‌పై జాతీయ రహదారి ఆవతల వున్న ఆనంద్ నగర్ కాలనీకి వెళ్తున్నారు. ఇంతలో రాజమండ్రి నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వచ్చి వారిని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో లారీ కింద పడిపోయిన మాధవి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. బైక్‌పై వున్న మిగిలిన స్నేహితులు దూరంగా పడడంతో స్వల్పంగా గాయపడ్డారు. మాధవి మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ప్రాణదాతలుగా నిలవాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- రక్తదాన శిబిరం ప్రారంభం

సాక్షి,పాడేరు: ఉన్నత చదువులు చదివే విద్యార్థులు రక్తదానం చేసి, ప్రాణదాతలుగా నిలవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. విజయ్ దివస్ సందర్భంగా జాతీయ సేవా పథకం పాడేరు డిగ్రీ కళాశాల విభాగం, రక్త చైతన్యకర్త రాష్ట్ర సేవా పురస్కార్ అవార్డు గ్రహీత కొమ్మోజు గణేష్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు సంయుక్తంగా శుక్రవారం పాడేరు డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించాయి. కార్యక్రమంలో భాగంగా ముందుగా దేశం కోసం అమరులైన సైనికులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన డిగ్రీ కాలేజీ విద్యార్థులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు, సామాజిక అంశాలను పెంపొందించుకోవాలని, సమాజ సేవలో భాగస్వాములవ్వాలన్నారు. యువకులు ఆరోగ్యవంతులై రక్తదానం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని విధాల సహకరిస్తున్నానని కలెక్టర్ తెలిపారు. శిబిరంలో రక్తదానం చేసిన 51మంది విద్యార్థులను కలెక్టర్‌తో పాటు నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబ్బాయి, వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ శంకర్‌ప్రసాద్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, ఎన్‌ఎస్ఎస్ యూనిట్ పీవోలు గౌరిశంకరరావు, రమేష్‌కుమార్, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు, కోశాధికారి అప్పారావు, సభ్యులు కొమ్మోజు రమణ, గోవింద్, ప్రసాదనాయుడు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వివాహిత మృతి

చోడవరం రూరల్: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన వివాహిత నరంశెట్టి ధనలక్ష్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు చోడవరం ఎస్‌ఐ బి.యమున తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాల ప్రకారం 28 ఏళ్ళ ధనలక్ష్మి వారంరోజుల క్రితం కుటుంబ పరమైన సమస్యల కారణంగా గడ్డి మందును తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు ఆమెను విశాఖలోని కింగ్ జార్జి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు శుక్రవారం ఆమె భర్త నానాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మయున తెలిపారు.

అడవి బిడ్డలకు మరింత పోషణ

- పౌష్టికాహారం కిట్లు పంపిణీ
- బాలింతలు, గర్భిణుల ఇళ్లకే పోషకాహారం అందేలా చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు

అనంతగిరి: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వివిధ పథకాలను అమలుచేస్తూ గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏజెన్సీలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కాలినడక వచ్చేందుకు బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడకుండా నేరుగా పోషకాహారం ఇంటికి అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మెయిన్, మీని అంగన్‌వాడీ కేంద్రాలు: 3,214
చిన్నారులు: 78,061
గర్భిణులు: 12,549
బాలింతలు: 50,183

జిల్లాలోని 3214 అంగన్‌వాడీ మీని, మెయిన్ కేంద్రాలు ఉన్నాయి.. కరోనా కారణంగా బాలింతలకు, గర్భిణులకు సరుకులను నేరుగా అందజేసేవారు. ఈ ఏడాది జూలై నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పాటుగా బాలింతలకు, గర్భిణులకు, పోషకాహారం వండి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

కేంద్రాల ద్వారా పోషకాహారం వండి పంపించడంతో పాటుగా ఇంక దూర గ్రామాలైతే, నెలకు సరిపడ సరుకులను వారికి రెండు విడతల్లో పంపిణీ చేసేవిధంగా చర్యలు చేపట్టారు.

వైఎస్సార్ సంపూర్ణపోషణ ప్లస్ కిట్‌లో...

చిరుధాన్యాలతో కూడిన గోధుమపిండి– 2 కేజీలు
వేరుశెనగ చెక్కి – అర కిలో
ఎండుకర్జూరం – అరకిలో
బెల్లం అర – కిలో
రాగి పిండి – అర కిలో

మాతా శిశువు మరణాలు ఆరికట్టేందుకు..

అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా బాలింతలకు, గర్భిణులకు పోషకాహారం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తూ, క్షేత్రస్థాయిలో అమలుపై దృష్టిపెట్టింది. గతంలోని సక్రమంగా పోషకాహారం అందికపోవడంతో మాతశిశువు మరణాలు సంఖ్య అధికంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ బలోపేతంపై దృష్టి పెట్టి, గిరిజన ప్రాంతంలోని మాతాశిశువు మరణాలు ఆరికట్టేలా వైఎస్సార్ సంపూర్ణపోషణ ప్లస్, పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టిసారించి, అమలుచేస్తోంది.

బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేస్తున్న సరకులు

గర్భిణులు, బాలింతలకు..
బియ్యం–మూడు కేజీలు
నూనె–400 గ్రాములు
కందిపప్పు–750 గ్రామాలు
గుడ్లు–25

బాలింతలు, గర్భిణులకు వరం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ పథకంతో గర్భిణులు, బాలింతలు వరం . పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలుచేస్తుండడంతో హర్షణీయం. కేంద్రాలకు రాలేని గర్భిణులు, బాలింతలకు సరకులు అందించేలా చర్యలు చేపట్టాం. కేంద్రాలకు వచ్చేవారికి పౌష్టికాహారం వండిపెడుతున్నాం. వాటిని సద్వినియోగం చేసుకోని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు.

– సంతోషికుమారి, ఐసీడీఎస్, సీడీపీవో అనంతగిరి

18న మంత్రి రోజా లంబసింగి రాక

చింతపల్లి: లంబసింగిలో ఏపీ పర్యాటక శాఖ భవనాల ప్రారంభానికి ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి ఆర్‌కే రోజా విచ్చేస్తున్నట్టు ఆ శాఖ ఎండీ కన్నబాబు తెలిపారు. సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన రెస్టారెంట్,11 రిసార్ట్‌లను ఆమె ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

మారథాన్ కాంపిటీషన్‌కు గురుకుల ప్రాజెక్టు

డయాబెటిస్ ట్రీట్‌మెంట్ విత్ ఫ్రూట్ నమూనా ఎంపిక



ఫార్ములా రూపొందించిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: మధుమేహం నియంత్రణకు నర్సీపట్నం డాక్టరు బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యార్థినులు రూపొందించిన డయాబెటిస్ ట్రీట్‌మెంట్ విత్ ఫ్రూట్ ప్రాజెక్టు నమూనా జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఏటీఎల్ మారథన్ 2021–22 సంవత్సరానికి గాను ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రాజెక్టులను ఆహ్వానించింది. గురుకుల ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయిని పి.రమాదేవి మార్గదర్శకత్వంలో ఎనిమిదో తరగతి విద్యార్థినులు ఎం.శశి, ఎం. ప్రశాంతి నేరేడు గింజలతో మధుమేహం వ్యాధి నియంత్రణకు రూపొందించిన మోడల్ ప్రాజెక్టును సమర్పించారు. జాతీయ స్థాయి కాంపిటేషన్‌కు 300 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, అందులో తమ విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ఉండటం విశేషమని ప్రిన్సిపాల్ తెలిపారు.

అపూర్వ వేడుకకు వేళాయెె...


పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించే కన్వెన్షన్ సెంటర్

- నేడు ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ లిమిటెడ్ వ్యవస్థాపకులు ఎస్.ఆర్.నారాయణ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. కార్యక్రమానికి జీఎంఆర్ సంస్థల చైర్మన్, ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జీఎంరావు అధ్యక్షత వహిస్తారు. అవంతి ఫీడ్స్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అల్లూరి ఇంద్ర కుమార్ విశిష్ట అతిథిగా హాజరవుతారు. కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఆచార్య బీలా సత్యనారాయణ పాల్గొంటారు. బీచ్‌రోడ్‌లోని కన్వెన్షన్ సెంటర్లో సాయంత్రం నాలుగు గంటల నుంచి సుమారు మూడు గంటల పాటు కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 3 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలను ఏయూ సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో వేదికపై ప్రదర్శిస్తారు. అనంతరం విశిష్ట స్థానాలకు ఎదిగిన పలువురు పూర్వ విద్యార్థులు ప్రసంగాలు ఉంటాయి. పూర్వ విద్యార్థుల సంఘం వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ముఖ్యఅతిథి విడుదల చేస్తారు. అదేవిధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది మహోత్సవం ప్రత్యేక లోగోను ఆవిష్కరిస్తారు. అతిథుల ప్రసంగాలు అనంతరం అతిథుల ప్రసంగాలు, సన్మాన కార్యక్రమంతో కార్యక్రమం ముగుస్తుంది.

ప్రత్యేక ఆకర్షణగా వీసీ–నారాయణ మూర్తిల సంభాషణ

కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విధంగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. దీనిలో భాగంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి స్వయంగా ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తిని వివిధ అంశాలపై పలు ప్రశ్నలు అడుగుతారు. వాటికి నారాయణమూర్తి సమాధానమిస్తారు.

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన లేదు

ట్రాన్స్‌కో సీఎండీ శ్రీధర్ స్పష్టీకరణ


మాట్లాడుతున్న సీఎండీ శ్రీధర్

అరసవల్లి (శ్రీకాకుళం): రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత నగరంగా ఉన్న విశాఖపట్నంలో రానున్న రోజులను దృష్టిలో ఉంచుకుని అత్యధిక సామర్థ్యంతో విద్యుత్ అవసరాలు తీర్చేలా ప్రత్యేక దృష్టి సారించామని ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్ స్పష్టం చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ట్రాన్స్‌కో, ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జీలకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరంలో వినియోగదారులపై ఏ మాత్రం భారం పడదని, అసలు డిస్కంల నుంచి చార్జీల పెంపు ప్రతిపాదనలే లేవని ఆయన స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి సందేహాలు అక్కర్లేదన్నారు. రాష్ట్రంలో ప్రధాన నగరమైన విశాఖపట్నంలో మాత్రం రోజుకు సుమారు 28 మిలియన్ యూనిట్లు (ఎంయూ) విద్యుత్ రోజుకు వినియోగం జరుగుతుందని, దీంతో పాటు త్వరలోనే విశాఖ పరిసరాల్లో కొత్తగా పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఇప్పటికే కాపులుప్పాడ, ఎండాడ, భీమిలి తదితర చోట్ల ఇప్పటికే 220 కేవీ సబ్‌స్టేషన్లు పూర్తయ్యాయని, కొత్తగా చందనాడ (పాయకరావుపేట)లో 220/132 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు నిర్ణయించామన్నారు. అలాగే విశాఖ నగరంలో 132 కేవీ కండక్టర్‌ను మార్చేందుకు నిర్ణయించామని, రింగ్ సర్క్యూట్స్‌ను ప్రత్యామ్నాయ మార్గాలుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. తుఫాన్ల ప్రభావిత జిల్లాగా ఉన్న శ్రీకాకుళం జిల్లాలో 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంపై సమీక్షలో చర్చించామని, అలాగే రైల్వే అధికారుల ప్రతిపాదనల మేరకు హైస్పీడ్ రైళ్ల వినియోగానికి గాను ఇదే జిల్లాలో పొందూరు, నౌపడ, బారువ రైల్వే స్టేషన్లలో అదనంగా 180 మెగావాట్ల వరకు విద్యుత్ సామర్థ్యం పెంపునకు నిర్ణయించామన్నారు.

పెద్దల సమక్షంలో ప్రేమపెళ్లి


పెద్దల సమక్షంలో ఒక్కటైన ప్రేమికులు

మునగపాక: ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. తీరా వివాహ చేసుకోవాలనేసరికి ప్రియుడు ముఖంచాటేశాడు. దీంతో తనకు న్యాయం చేయాలని ప్రియురాలు పోలీసులను ఆశ్రయించింది. ప్రియుడికి పోలీసులు, ఇరువైపులా తల్లితండ్రులు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పెళ్లికి అంగీకరించాడు. పెద్దల సమక్షంలో మునగపాక శివాలయంలో ఇద్దరికి పెళ్లి జరిగింది. వివరాలు.. మునగపాక మండలం కుంచవానిపాలెం గ్రామానికి చెందిన కాయల మురళి, వాడ్రాపల్లికి చెందిన మళ్ల దివ్యలు గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. మురళి పెళ్లికి నిరాకరించడంతో దివ్య నాలుగు రోజుల క్రితం మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో కౌన్సిలింగ్ చేశారు. ఇరు కుటుంబాల పెద్దలు కూడా సర్దిచెప్పారు. దీంతో మునగపాక లింగరాయి గుడిలో ప్రేమికులిద్దరికీ పురోహితుల నడుమ వివాహం జరిపించారు. వాడ్రాపల్లి, మల్లవరం సర్పంచ్‌లు కాండ్రేగుల నూకరాజు, ఇందల హేమలత నాయుడు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, కాండ్రేగుల నూకప్పారావు తదితరులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.

రైతులకు అండగా ప్రభుత్వం


ధాన్యం కొనుగోలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, జేసీ శివ శ్రీనివాస్ తదితరులు

రంపచోడవరం: ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోందని ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మిలు అన్నారు. మండలంలోని బందపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్‌తో కలిసి వారు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడంతో రైతులు దళారులకు విక్రయించి మోసపోయే పరిస్థితి లేదన్నారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ డొక్కులూరి రత్నరాజు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేయాలని, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడీ వీకె చౌదరి, సివిల్ సప్లయి డీఎం శేఖర్, ఏఓ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ సిబ్బందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాడేరు రూరల్ : కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 54 మంది వైద్య పరీక్షలు జరిపారు. నలుగురు ఉద్యోగులకు రక్తహీనత దృష్ట్యా వాటి నివారణకై ఐరన్ మాత్రల వినియోగానికి వైద్యారోగ్య శాఖ జిల్లా కార్యాలయ వైద్యాధికారి డాక్టర్ బి. రాణాప్రతాప్ సూచించారు. ఆరుగురు ఉద్యోగులకు అధిక రక్త పోటు ఉండడంతో స్థానిక జిల్లా ఆస్పత్రిలో పలు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోజువారీ తీసుకోవాల్సిన ఆహార సూత్రాలపై అవగాహన కల్పించారు. ఏదైన అనారోగ్యం చేస్తే అలసత్వం చేయకుండా సమీపంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. ఐటీడీఏ ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, వైద్య సిబ్బంది శెట్టి నాగరాజు, కృష్ణవేణి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.